క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల పరిశీలన


జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలలో గదులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేదు: పదో తరగతి పరీక్షల కోసం జ్యోతిరావ్‌పూలే బాలుర గురుకుల పాఠశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పరీక్ష కేంద్రాలను ఎంఈఓ కే.రవి శనివారం పరిశీలించారు. నీటి వసతి, లైట్లు, ఫ్యాన్లు, డెస్కులు, మరుగుదొడ్లను పరిశీలించి ప్రిన్సిపాల్ శ్రీనివాసులుతో మాట్లాడారు. పి.వెంకటేశ్వర్లు, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 195 మంది, జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలలో 235 మంది, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 230 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

బస్టాండ్ వద్ద చలివేంద్రం


ప్రారంభిస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు వద్ద ఆటోస్టాండ్ యూనియన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ సిరాజ్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు, వాహనదారులకు అనుకూలంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఆటోస్టాండ్ నాయకులు షేక్ జులేఆషా, వార్డు కన్వీనర్ షేక్ ఫజల్, షాను, షఫీ, షమీర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరులో మునిరాజయ్య కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు ఆకర్ష్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. మునిరాజయ్య(64) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఆకర్ష్ రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలకుగాను రూ.10 వేలు నగదును అందించారు. సర్పంచ్ మోహనప్రియ పాల్గొన్నారు.

రూ.42 లక్షలతో సచివాలయ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం


బుచ్చినాయుడుకండ్రిగలో నిర్మిస్తున్న శానిటరీ కాంప్లెక్స్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 14 గ్రామ సచివాలయాల వద్ద రూ.42 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. తద్వారా సిబ్బందితోపాటు ప్రజలకు మరుగుదొడ్ల సమస్య తీరుతుందని పేర్కొన్నారు.

పనిచేయని అధికారులు అవసరం లేదు

నారాయణవనం: బాధ్యతగా పనిచేయని వారు బదిలీ చేసుకుని వెళ్లి పోవచ్చని జెడ్పీటీసీ సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరుకావడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి మాట్లాడుతూ నారాయణవనం నుంచి పాలమంగళం వరకు జాతీయ రహదారిపై 10కి పైగా కల్లు షాపులు రాత్రికి రాత్రే తెరిచారని తెలిపారు. తమిళనాడుకు చెందిన యువకులు పూటుగా కల్లు తాగి ఇబ్బంది కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, వారిపై చర్యలకు జిల్లా అధికారులకు నివేదికలను పంపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సభ్యులు సూచించిన సమస్యలకు పరిష్కారం చూపాలని, మండల పరిషత్ సభా గౌరవాన్ని పెంచేలా పనిచేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈవోకు తీర్మానాన్ని పంపాలని ఎంపీడీవో గుణశేఖర్‌కు సూచించారు. ఈవోపీఆర్డీ డాక్టర్ వేణయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. తెల్లవారుజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు.తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించుకుందాం


మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి


హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి రూరల్: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలుపించుకుందామని పార్టీ రేణిగుంట, తొట్టంబేడు మండలాల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కార్యాలయంలో శనివారం శ్రీకాళహస్తి మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అత్యధిక మెజారిటీ వచ్చేలా చూడాలన్నారు. తమ పరిధిలోని గ్రామాల్లో పట్ట భద్రులను గుర్తించి పేర్నాటికి ఓటు వేయమని అభ్యర్థించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించాలని తెలిపారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి సచివాలయం వ్యవస్థను తీసుకువచ్చి సుమారు ఆరు లక్షలకు పైగా నిరుద్యోగులకు ఉద్యోగం అవకాశం కల్పించారని పట్టభద్రుల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. పేర్నాటి సాధారణ రైతు కుటుంబానికి చెందిన వారని, మంచి సేవాతత్పరుడు కావడంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అవకాశం కల్పించారని అన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవని పేరు మాత్రమే ఉంటుందని, దానికి ఎదురుగా 1 అనే సంఖ్యను మాత్రమే వేయాలన్నారు. ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు ఒకటి వేసి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామాల వారీగా ఓటర్ లిస్ట్‌లను, బ్యాలెట్ నమూనా పత్రాలను అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగాల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, పాల సొసైటీ చైర్మన్ మునగాల మధుసూదన్‌రావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల కన్వీనర్ వెంపల్ల సురేంద్రయాదవ్, వైస్ ఎంపీపీ అక్కుపల్లి భానుమూర్తియాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాయుడు, చెంచయ్యనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, వయ్యాల మనోహర్‌రెడ్డి, చుక్కల కిరణ్, గోపిగౌడ్, హరిబాబురాయల్, మునిరాజరాయల్, నాగభూషణ్‌యాదవ్, చెంచయ్య యాదవ్, వెంకటేష్‌యాదవ్, చంద్రబాబుయాదవ్, శేఖర్‌యాదవ్, అంకయ్య, పాపయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ కోరారు. శనివారం బ్యాలెట్ నమూనాతో గ్రామాల్లో ఆమె ప్రచారం ప్రారంభించారు. పొయ్యి సచివాలయం పరిధిలోని పొయ్యి పంచాయతీ, పోయ్యి కొత్తూరు, కొమ్మనగుంట గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డికి వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసు నాయుడు , ఎమ్మెల్సీ ఎన్నికల పార్టీ ఇన్‌చార్జి కేతినేని వెంగళరావు, అశోక్, తీర్థ రామన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


పుదుకుప్పంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సత్యవేదు: ఈ నెల13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం పుదుకుప్పం, అంబాకం, మదనంబేడు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని కోరారు. మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ శరవనన్, శెల్వం, వెంకటేశన్, కేశవన్, ధనపాల్, కనకరాజ్, ఆనందయ్య పాల్గొన్నారు.

పేర్నాటి గెలుపు.. పట్టభద్రుల గెలుపు


పిచ్చాటూరులో మండలం కీళపూడిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డిని గెలిపిస్తే ప్రతి పట్టభద్రుడూ గెలిచినట్లేనని, సమస్యలపై అవగాహన ఉన్న ఆయన చట్టసభకు వెళితే సమస్యలపై గొంతు విప్పుతారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన శనివారం పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. పిచ్చాటూరు మండలం జలకంఠేశ్వర స్వామి కల్యాణ మండపంలో పట్టభద్రులతో సమావేశమయ్యారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. మధ్యాహ్నం నాగలాపురం మార్కెట్ యార్డులో పట్టభద్రులతో సమావేశమై పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి టీచర్లతో సమావేశమై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు కేటీ హరిశ్చంద్రారెడ్డి(పిచ్చాటూరు), అపరంజిరాజు(నాగలాపురం), రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, నాయకులు రమణారెడ్డి, చిన్నదొరై, మోహన్ మొదలి, తొప్పయ్య, కేజీ రోస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఎస్ఎం సురేష్, జేబీఆర్ మునిరత్నం, పాల పద్మనాభం, మోహన్ పాల్గొన్నారు.


మత్తేరిమిట్టలో రమణారెడ్డి, నేతల ప్రచారం


నారాయణవనంలో..


బీఎన్‌కండ్రిగ : పెద్దపాలేడులో ప్రచారం..


బీఎన్‌కండ్రిగ: పల్లమాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

పేర్నాటికి ఘన విజయాన్ని ఇవ్వండి

వరదయ్యపాళెం: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ ఎన్నికల సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు దువ్వూరు రమణారెడ్డి కోరారు. ఆయన శనివారం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి మత్తేరిమిట్ట, చిలమత్తూరు, బత్తలవల్లం గ్రామ పంచాయతీల్లో ప్రచారం చేశారు. పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, సచివాలయాల కన్వీనర్ చిన్నా, మండల ప్రచార కమిటీ కన్వీనర్ చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఎంపీటీసీ శ్యామలమ్మ, సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటికి మద్దతుగా ప్రచారం

నారాయణవనం: వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని నాయకులు కోరారు. వారు శనివారం నారాయణవనంలో ప్రచారం చేశారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బాబు, కైలాసకోన ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ శివశంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, మండల సచివాలయ కన్వీనరు జయచంద్రనాయుడు పిలుపునిచ్చారు. వారు శనివారం పెద్దపాలెడు, చిన్నయగుంట, పల్లమాల, కాటూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, ఆలత్తూరు, జీఎస్‌కండ్రిగ, ఆర్.అనంతాపురం గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనరు ప్రసాద్ పాల్, నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీలు వరలక్ష్మి, రవి, నాయకులు మురళి, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమ్మిట్‌లో శ్రీసిటీ స్టాల్‌ను సందర్శించిన మంత్రి బుగ్గన




శ్రీసిటీ స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

సత్యవేదు: విశాఖలోని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్-2023లో శ్రీసిటీ ఏర్పాటుచేసిన స్టాల్‌ను శనివారం రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సందర్శించారు. ఆయనకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి శ్రీసిటీ ప్రత్యేకతలు, వివిధ పరిశ్రమలు, వాటి ఉత్పత్తుల గురించి వివరించారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని పాతగుంట పంచాయతీ పరిధి తిమ్మవరం ఎస్టీకాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చిన్నయ్య(61) కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. చిన్నయ్య వారం రోజుల కిందట మృతి చెందాడు. కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పాతగుంట పంచాయతీకి చెందిన శేఖర్ యాదవ్, చంద్రశేఖర్‌నాయుడుకు ఆమె నగదు అందించారు. వారు తిమ్మవరం ఎస్టీకాలనీకి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులకు సాయం అందించారు.

పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే మెమోలు

సత్యవేదు: పంచాయతీల్లో పన్నులు వసూలు చేయని సచివాలయ కార్యదర్శులకు చార్జి మెమోలు ఇస్తామని డీపీవో రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయంలో నాగలాపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు, సత్యవేడు మండలాల సచివాలయ కార్యదర్శులతో జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఇంటి పన్నుల వసూలుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. పంచాయతీల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణను సమగ్రంగా చేపట్టాలన్నారు. సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సంపద సృష్టి కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువును తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందాలని సూచించారు. ఈఓపీఆర్డీ విజయకుమారి(వరదయ్యపాళెం), శ్రీదేవి(పిచ్చాటూరు) ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ రవిమునికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీఓ రాజశేఖర్ రెడ్డి

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఈఈ వాసురెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని న్యాయవాది రమేష్‌బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీకాళహస్తి కోర్టు పరిధిలోని న్యాయవాదులు మండలంలోని చల్లపాలెం గ్రామంలో మహిళా హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకుని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా సాధికారిత చట్టాలపై అవగాహన ఉంటే ఎలాంటి ఇబ్బందులనైనా ఎదుర్కొని వచ్చని తెలిపారు. వేతన, గౌరవ, మర్యాద, కార్యాలయాల్లో వేధింపుల నుంచి రక్షణ, గృహహింస, గోప్యతను కాపాడే, ఉచిత న్యాయ, వర్చువల్ ఫిర్యాదును ఫైల్ చేసే హక్కులపై అవగాహన కల్పించారు.

శ్రీసిటీలో ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు




విజేతకు బహుమతులు అందజేస్తున్న శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(ప్రాజెక్ట్స్) శేఖర్, వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలు

సత్యవేదు: కార్మికుల భద్రతా ఆవశ్యకతను గుర్తించి శ్రీసిటీలో చేపట్టిన 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగిశాయి. స్థానిక ట్రేడ్ సెంటర్‌లో శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(ప్రాజెక్ట్స్) శేఖర్ భద్రతా వారోత్సవాల జెండాను ఎగురవేసి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఆయన ప్రసంగిస్తూ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టర్లు, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే జాతీయ భద్రతా వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్మికులు తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించాలని, నిర్దేశిత భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది మనలక్ష్యం జీరో హాని అన్నది కేంద్ర జాతీయ భద్రతా కౌన్సిల్ నినాదమని, ఈ మేరకు విస్తృతంగా ప్రచారం చేసేందుకు అందరూ ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు శేఖర్ బహుతులు ప్రదానం చేశారు శ్రీసిటీ సేఫ్టీ మేనేజర్ కే.నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

లైన్ల మరమ్మతుల్లో జాగ్రత్తలు అవసరం


మాట్లాడుతున్న ఈఈ వాసురెడ్డి

శ్రీకాళహస్తి: లైన్ల మరమ్మతు సమయంలో జాగ్రత్తలు అవసరమని శ్రీకాళహస్తి విద్యుత్ సబ్‌డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాసురెడ్డి తెలిపారు. శనివారం జాతీయ లైన్‌మెన్ డే సందర్భంగా లైన్‌మెన్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పగలూరాత్రి అన్న తేడాలేకుండా లైన్‌మెన్లు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు. వానల్లో సైతం విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ మరమ్మతులు చేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు సతీష్‌బాబు, సాయిశంకర్, పుణ్యకోటి, రాజేష్, చెంచుకృష్ణ, బాలాజీ, కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

4 వేల బాతుల మృతి

- విష ప్రయోగం చేశారని అనుమానం

ఏర్పేడు: పాపానాయుడుపేట వ్యవసాయ పొలాల్లో శనివారం ఉదయం 4 వేల బాతులు మృతిచెంది ఉన్నాయి. రేణిగుంటకు చెందిన లోకేష్ 10 రోజులుగా తనకున్న 4 వేల బాతులను పాపానాయుడుపేట వ్యవసాయ పొలాల్లో తోలుకుని మేపుకుంటున్నాడు. శుక్రవారం బాతులను పొలాల్లో మేపుకుని సాయంత్రం అక్కడే ఏర్పాటుచేసుకున్న టెంట్‌లోకి తోలాడు. రాత్రి అతను భోజనం చేసి నిద్రించాడు. శనివారం ఉదయం లేచి చూడగా బాతులన్నీ మృతిచెంది ఉండడాన్ని గుర్తించి లబోదిబోమని విలపించాడు. ఏర్పేడు సీఐ శ్రీహరికి ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించాడు. సీఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పక్కన ఉన్న మరో బాతుల యజమాని తమ బాతులపై విష ప్రయోగం చేసి ఉండవచ్చని బాధితుడు అనుమానం వ్యక్తంచేస్తున్నాడు.


మృతి చెందిన బాతులు

పల్లికొండేశ్వరాలయంలో వేడుకగా మహాప్రదోష పూజలు


నంది విగ్రహానికి చందనంతో అభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకులు


విశేష అలంకరణలో ఉన్న నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకులు


సురుటపల్లి పల్లికొండేశ్వరాలయంలో శివపార్వతుల ప్రాకారోత్సవం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి పల్లికొండేశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకొని మహా ప్రదోష పూజలు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం వాల్మీకేశ్వర స్వామికి అభి ముఖంగా ఉన్న నందీశ్వరునికి విశేష అభిషేకాలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకు ముందు మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి, మంగళాదేవి సమేత పల్లికొండేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తి, రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం చేశారు. మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీర్థం పంపిణీ ప్రారంభం

సురుటపల్లి పల్లికొండేశ్వరాలయంలో నందీశ్వరునికి అభిషేకించిన తీర్థాన్ని శనివారం సాయంత్రం బాటిళ్ల ద్వారా పంపిణీ చేశారు. ఒక బాటిల్ రూ.25 చొప్పున అందజేశారు. భక్తుల కోరిక మేరకు ఆలయ ధర్మకర్తల మండలి తీర్మానం చేసి తీర్థం పంపిణీని ప్రారంభించినట్లు ఈఓ రామచంద్రారెడ్డి తెలిపారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు


అభిషేకం చేస్తున్న వేదపండితులు


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీశనీశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కలశ పూజలు నిర్వహించారు. తైలాభిషేకం, పలు రకాల సుగంధ ద్రవ్యాల అభిషేకాల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన లక్ష్మి వెంకటేశ్వర రెడ్డి దంపతులు శనివారం రూ.10,116 విరాళంగా అందజేశారు.ఆలయ అధికారులు సతీష్‌మాలిక్‌ను కలసి ఈమేరకు విరాళం అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు.


విరాళం అందజేస్తున్న దాత